క్లుప్తంగా

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి: డీసీపీ సాయిశ్రీ



చిన్నారులతో డీసీపీ సాయిశ్రీ తదితరులు

వనస్థలిపురం: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. వెంకటరమణకాలనీలోని రవీంద్ర భారతి పాఠశాల ప్రాథమిక విద్యార్థుల స్నాతకోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీపీ విద్యార్థులకు పతకాలు, ప్రశంస పత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాఠశాల జోనల్ డీన్ కె.జ్యోతి, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, డీఐ దయాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సత్వరమే రోడ్ల మరమ్మతు

ఎల్‌బీనగర్: ఎప్పటికప్పుడు రోడ్ల మరమ్మతులను చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సాహెబ్‌నగర్‌లో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులను జీహెచ్‌ఎంసీ ఏఈ రాకేష్‌తో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పనులు జరుగుతున్నప్పుడు పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఏఈకి సూచించారు.

మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా గణేష్



మన్సూరాబాద్: మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా మన్సూరాబాద్ డివిజన్ లెక్చరర్స్ కాలనీకి చెందిన జంగం గణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ... మాలల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, మాలల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు జంగా శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాగరి కులస్తులు హక్కుల సాధనకు పోరాడాలి



మాట్లాడుతున్న బేర బాలకిషన్

చైతన్యపురి: బ్యాగరి కులస్తులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ (బాలన్న) అన్నారు. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాల బ్యాగరి వృత్తిదారుల సంఘం విస్తృత స్థాయి సమావేశం సరూర్‌నగర్ కట్ట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బేర మాట్లాడుతూ... కాటికాపరులకు గుర్తింపు కార్డుల అందజేయాలని, మాల బ్యాగరి వృత్తిదారులకు జీవిత బీమా, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. సంక్షేమ భవన్ నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం కేటాయించి రూ. 5 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. హిందూ శ్మశాన వాటికలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, జిల్లాల బ్యాగరి, కాటికాపరి వృత్తిదారులు పాల్గొన్నారు.

మలక్‌పేట మార్కెట్‌లో చెత్త షరామామూలే!



మలక్‌పేట మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తకుప్పలు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని వ్యవసాయ మార్కెట్‌ను నిత్యం వేలాది మంది సందర్శిస్తారు. ఆవరణ మొత్తం చెత్త ఇతర వ్యార్థలతో నిండిపోతాయి. వాటి నుంచి ముక్కుపుటాలు అదిరిపోయేలా దుర్గంధం వెదజల్లుతూ ఉంటుంది. ఈ పరిస్థితిని మార్చేందుకు ఇటీవలే కాంట్రాక్టర్‌ను మార్చారు. జీహెచ్‌ఎంసీ అనుబంధ సంస్థకు చెత్తలిఫ్టింగ్ కాంట్రాక్ట్‌ను అప్పగించినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు కన్పించడం లేదు. ఇకనైనా అధికారులు, పాలకవర్గం ప్రత్యేక శ్రద్ధ వహించి మార్కెట్‌లో చెత్తకుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

శ్రీరామనవమికి సర్వం సిద్ధం



అష్టలక్ష్మీ ఆలయంలో కొలువైన సీతారాముల విగ్రహాలు

- రాములోరి కల్యాణానికి పటిష్ట ఏర్పాట్లు
- సర్వాంగ సుందరంగా దేవాలయాల ముస్తాబు
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- పెద్ద ఎత్తున అన్నదానాలు, ప్రసాద వితరణ



కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో వేసిన చలువ పందిళ్లు

దిల్‌సుఖ్‌నగర్: శ్రీరామ నవమి పర్వదినాన్ని గురువారం వేడుకగా నిర్వహించేందుకు దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేసేందుకు మలక్‌పేట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని దేవాలయాలు, కాలనీలు, కమ్యూనిటీ హాళ్లలో ఏర్పాట్లను పూర్తి చేశారు.

- శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రధాన ఆలయాలను విద్యుత్ దీపాలు, రంగురంగుల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీప కాంతులతో ప్రధాన ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. ఆలయాలు చలువ పందిళ్లు, ప్రత్యేక అలంకరణలతో సీతారాముల కల్యాణానికి సిద్ధమయ్యాయి.
- జోన్ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద సీతారాముల విగ్రహాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సీతారాముల కల్యాణోత్సవం అనంతరం ఆలయాల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు, ప్రసాద వితరణ చేయనున్నారు. అనంతరం సీతారాముల విగ్రహాలను కాలనీలలో ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని, స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని పోలీసు అధికారులు తెలిపారు.



కుర్మగూడలో సీతారామాంజనేయ స్వామి

ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో...

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో గురువారం నిర్వహించే శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేదుకు వివిధ దేవాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా దేవాలయాల కమిటీల నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఎల్‌బీనగర్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ధ్యాన ఆంజనేయ స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి, నాగోలులోని సీతారామచంద్ర స్వామి, స్నేహపురికాలనీలో వెంకటేశ్వర స్వామి, బండ్లగూడ అజయ్‌నగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయాలతోపాటు మన్సూరాబాద్, వనస్థలిపురం, కొత్తపేట, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలోని ఆలయాలలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. నాగోలు గ్రామంలోని పురాతన రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. గురువారం కల్యాణం నిర్వహించి రాత్రి సీతారామ చంద్ర స్వామివారి ఉత్సవ విగ్రహాలను నాగోలు గ్రామంలో ఊరేగిస్తారు.

దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో...

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో శ్రీరామనవమి, సీతారాయుల కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుండ మల్లయ్య తెలిపారు. గురువారం ఉదయం 6.50 గంటలకు సువర్ణ పుష్పార్చన (108 బంగారు పుష్పాలు), 8.45 గంటలకు సీతారామ కల్యాణ మహోత్సవ ఎదుర్కోళ్ల కార్యక్రమం, 10 గంటలకు సీతారాముల కల్యాణం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు షిరిడీ సాయిబాబా, సీతారామ లక్ష్మణ, హనుమాన్ల రథోత్సవం, విశేష పల్లకి ఊరేగింపు ఉంటుందన్నారు. 7.30 గంటలకు క్లాసికల డాన్స్ ఇన్‌స్టిట్యూట్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.



నాగోలు సాయినగర్ కాలనీలో సిద్ధం చేసిన కల్యాణ వేదిక

నాగోలు సీతారామచంద్ర స్వామి ఆలయంలో...

నాగోలు: నాగోలు గ్రామంలోని సీతారామచంద్ర స్వామి గోదా సమేత వేణుగోపాల అష్టలక్ష్మి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. రాములోరి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని ఎమ్మెల్సీ, ఆలయ కమిటీ చైర్మన్ యెగ్గె మల్లేశం తెలిపారు. స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఆలయ డైరెక్టర్లు ఇంద్రాల ముత్యాల గౌడ్, వస్పరి శంకర్ కురుమ, గోల్కొండ మైసయ్య, సిద్దాల దానయ్య, కట్ట ఈశ్వరయ్య గౌడ్, కొలన్ నరసింహా గౌడ్, నాగోల్ సుధాకర్ చారి, చింతల రవీందర్నాథ్ యాదవ్, అనంతల శ్రీనివాసరెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, బద్దం రవీందర్ గౌడ్, పోచంపల్లి మనీష్ రెడ్డి, బద్దం రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.



నాగోలులో వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యెగ్గె మల్లేశం తదితరులు

పన్ను చెల్లించకుంటే ఆస్తుల సీజ్

ఎల్‌బీనగర్ సర్కిల్–3 డీసీ మారుతీదివాకర్

ఎల్‌బీనగర్: మరో రెండు రోజుల్లో ఆస్తి పన్ను చెల్లింపు గడువు ముగిస్తుండంతో అధికారులు ఆస్తి పన్ను వసూళ్లలో కఠిన నిర్ణయాలకు సిద్ధం అవుతున్నారు. బకాయిదారులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశారు. తాజాగా వారెంట్లు జారీ చేసి నిర్ణీత గడువులోపు పన్ను బకాయిలు చెల్లించని పక్షంలో ఆస్తులను సీజ్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. తాజాగా ఎల్‌బీనగర్ సర్కిల్–3లోని హయత్‌నగర్ డివిజన్‌కు చెందిన సామ శంకర్‌రెడ్డి రూ. 1.23 కోట్ల మేరకు ఆస్తి పన్ను బకాయి ఉంది. ఈ విషయంలో అధికారులు పలు మార్లు పాత బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీచేశారు. అయినా ఆయన మొండికేయడంతో బుధవారం డీసీ మారుతీదివాకర్ అధ్వర్యంలో రెవిన్యూ అధికారులు సుష్మా చౌరస్తాలోని నిషా బార్ అండ్ రెస్టారెంట్‌తోపాటు పలు షాపులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మారుతీదివాకర్ మాట్లాడుతూ... బకాయిదారులు అందరూ గడువులోగా ఆస్తి పన్నులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. తమ ఆస్తులను సీజ్ వరకు పోకుండా చూసుకోవాలని కోరారు.

చంపాపేట అభివృద్ధికి కృషి: వంగా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే తన ప్రధాన లక్ష్యమని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. దుర్గాభవానీనగర్‌లో ఆయన బుధవారం అధికారులతో కలసి కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. గుంతల అంతర్గత రహదారులు, విస్తరణకు నోచుకోని భూగర్భ డ్రైనేజీని పరిశీలించి త్వరలో ప్రత్యేక నిధులతో సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సభ్యులు వెంకట్, నాయకులు అంజి, సుమిత్, సర్కిల్ ఏఈ సురేష్, ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సైదాబాద్: వేసవిలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. బృందావన్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

లీకేజీలపై మంత్రుల ప్రకటన సిగ్గుచేటు

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

మలక్‌పేట: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలపై మంత్రులు బాధ్యత రహితంగా మాట్లాడం సిగ్గుచేటని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలని, లీకేజీ కుంభకోణం వెనుక ఉన్న ప్రభుత్వ పెద్దలను శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరుద్యోగ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుల ఆశయాలు తుంగలో తొక్కి బీఆర్‌ఎస్ నిరుద్యోగుల జీవితాలను రోడ్డు పాలు చేసిందన్నారు. దిల్‌సుఖ్‌నగర్ కన్వీనర్ కుంచాల సాయిరామ్ అధ్యక్షతన జరిగిన దీక్షలో రాజశేఖర్, శ్యామ్‌కిరణ్, నోముల దీప్తి, హనుమాన్ చారి, అఖిల, సుష్మ, దుర్గ, రమ్య, భవాని, లయ, శ్రీలత, రవిప్రసాద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో...

హయత్‌నగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో పెద్దల హస్తం ఉందని దీనిపై విచారణ చేస్తున్న సిట్‌పై నిరుద్యోగులకు నమ్మకం లేదని, సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేయించాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అక్యారి మహేష్ డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో నిరుద్యోగ దీక్షను చేపట్టారు. ఎల్‌బీనగర్ జిల్లా కన్వీనర్ సిద్దార్థ్, నాయకులు రాకేష్, ఆకాష్, మౌనిక, అన్వేష్, సాయితేజ, పరమేష్, అనిత, నిహార్ తదితరులు పాల్గొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్‌లో దీక్షలో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు

చిరుధాన్యాల వినియోగంపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోత్స్న

సైదాబాద్: పోషక విలువలు ఎక్కువగా ఉండే చిరుధాన్యాలను అందరూ నిత్యం ఆహారంలో తప్పనిసరిగా తీసుకోవాలని చార్మినార్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జ్యోత్స్న సూచించారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని పద్మావతి కల్యాణ మండపంలో అంగన్‌వాడీ టీచర్లకు చిరుధాన్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డితో కలిసి ఆమె సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మార్చి 20 నుంచి ప్రారంభమైన పోషణ పక్షోత్సవాలు ఏప్రిల్ 3 వరకు కొనసాగుతాయన్నారు. బస్తీలు కాలనీలలో మహిళలకు తృణధాన్యాల వలన కలిగే లాభాలను, ఆరోగ్య సంరక్షణను టీచర్లు వివరించాలన్నారు. వైద్యాధికారి అరుణ, డీపీఓ యుగంధర్, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి: డీజీఎం సరిత

చంపాపేట: వేసవిలో నెలకొనే నీటి ఎద్దడిని ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని జలమండలి చంపాపేట డీజీఎం సరిత కోరారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా బుధవారం జలమండలి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చంపాపేటలో జల సంరక్షణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ... జీవకోటికి ప్రాణాధారమైన నీటి వనరులను కాపాడుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైశాలీనగర్, కటకోనికుంట, నెహ్రూనగర్ తదితర కాలనీలలో ర్యాలీ నిర్వహించి గడపగడపకూ వెళ్లి నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీపీఓ అశ్విని, మానస, సీఓ నర్సింహా, ఫౌండేషన్ సీఈఓ సురేందర్, హరీష్, సర్కిల్ సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డీజీఎం సరిత తదితరులు

సీపీఐ ఇంటింటి ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయండి

నాగోలు: సీపీఐ ఇంటింటి ప్రజా పోరు యాత్రను ప్రజలు జయప్రదం చేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యుడు బొడ్డుపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం న్యూనాగోలు కాలనీలోని ఎస్‌కే డాంగే భవన్‌లో సీపీఐ ఉప్పల్ మండల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కార్మికులు, ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇంటింటి పోరు యాత్ర చేపట్టి ప్రజా సమస్యలు గుర్తించి, పరిష్కారం కోసం ఉద్యమాలు చేసే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లలిత, మల్లేష్, రాములు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నాగోలు: కొత్తపేట గ్రామంలోని సర్వే నెంబర్‌లోని 143లోని ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను బుధవారం ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు, జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చి వేశారు. ప్రభుత్వం గతంలో 19 గుంటల స్థలాన్ని తెలంగాణ పార్క్‌కు కేటాయించింది. పక్కనే కొత్త మంది స్థానికులు ప్రభుత్వం స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా మార్చుకున్నారని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే చేసిన అధికారులు బుధవారం ఉప్పల్ మండల రెవెన్యూ సర్వేయర్ ప్రశాంత్, జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్‌తో ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వం స్థలం కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆలయాల వద్ద పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

మలక్‌పేట: శ్రీరామనవమి పండుగకు ఆలయాల వద్ద బుధవారం శానిటేషన్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. టెంపుల్ పరిసర ప్రాంతాలలో పేరుపోయిన చెత్త, చెదారం, మట్టికుప్పలు తొలగించారు. స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి ఆలయాలు సందర్శించి పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పర్యవేక్షించారు. తాత్కాలికంగా లైటింగ్ ఏర్పాటు చేయించారు. స్వామి వారికి కళ్యాణం తిలకించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన వసతులు కల్పించినట్లు కార్పొరేటర్ తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా పండుగ జరుపుకోవాలని, శోభయాత్ర సజావుగా కొనసాగడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ రమేష్, ఎస్‌ఎఫ్‌ఏలు సుభాష్, గణేష్, శ్రీను, నాయకులు కిరణ్, హరీష్, సందీప్, శివ, దినేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



రామాలయం వద్ద పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

శివారు కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: మహానగర శివారు ప్రాంతాల్లో భాగంగా ఉన్న హయత్‌నగర్ డివిజన్‌లో వేగంగా కాలనీలు విస్తరిస్తున్నాయని ఆయా కాలనీల్లోని ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రత్యేక నిధులతో చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ మ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి హయత్‌నగర్ డివిజన్‌లోని వర్ధయ్యనగర్, శంకర్‌నగర్, ముదిరాజ్ బస్తీ, రజకబస్తీ, కాస్‌బాగ్, వెంకటాద్రి నగర్‌లలో సుమారు రూ. 1.64 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, సమస్యలు లేకుండా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, భాస్కర్‌సాగర్, మల్లేష్, బండారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రధాన అజెండా...

వనస్థలిపురం: నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలో రూ. 48 లక్షల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఆయన స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు. ఎఫ్‌సీఐ కాలనీలో వాటర్ పైప్‌లైన్ పనులకు, క్రాంతి హిల్స్ కాలనీలో కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, ఎఫ్‌సీఐ కాలనీ అధ్యక్షుడు సిరిగిరి రాంరెడ్డి, నాయకులు చింతల రవికుమార్, గంగుల కృష్ణారెడ్డి, శ్రీధర్‌గౌడ్, లతా ఆనంద్‌రాజ్, మధుగౌడ్, పి.వి.ఎస్.రావు, సంతోష్, అజయ్‌యాదవ్, నూతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

నాగోలు: కొత్తపేట డివిజన్ శ్రీరామలింగేశ్వర కాలనీలో రూ. 3 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్‌తో కలసి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. శ్రీ రామలింగేశ్వర కాలనీ కమాన్ నుంచి తెలంగాణ పార్కు వరకు వర్షపు సాఫీగా వెళ్లేందుకు ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్స్ పనులకు శంకుస్థాపన చేశారు. విజయపురి కాలనీ కల్వర్టు నుంచి గణేష్ టెంపుల్ వరకు ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్స్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, సీనియర్ నాయకులు మహేష్ రెడ్డి, విశ్వేశ్వరరావు, శ్రీశైలం గౌడ్, దీప్ లాల్, గాలయ్య, బాలాజీ, జంగీర్ బాబు గౌడ్, ఇటికల యాదగిరి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొత్తపేట డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ లేకుండానే అభివృద్ధి పనులకు శంకస్థాపన ఎలా చేస్తారని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. తనకు ఇచ్చిన సమయం కంటే ముందే వచ్చి మరో స్థలంలో ఎలా శంకుస్థాపన చేస్తారని ప్రశ్నించారు.



హయత్‌నగర్ పాతబస్తీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా...

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బుధవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శుభం ప్యాలెస్‌లో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఎమ్మెల్సీ దయానంద గుప్తా, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాసగుప్తా, పార్టీ నాయకులు అమరవాది లక్ష్మీనారాయణ తదితరుల హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... ఎల్‌బీనగర్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకే సీఎం కేసీఆర్ హామీతో తాను బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరానని గుర్తు చేశారు. కేసీఆర్ అండదండలతో ఇప్పటికే నియోజకవర్గం పరిధిలోని ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు, ప్రాపర్టీ ట్యాక్స్ తగ్గింపు వంటి సమస్యలు పరిష్కరించామన్నారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కప్కారానికి ఫ్లై ఓవర్లు, ఫ్రూట్ మార్కెట్, ఆటోనగర్‌లోని చెత్త డంపింగ్ కేంద్రం తరలింపు, చెరువుల సుందరీకరణ, అంతర్జాతీయ ప్రమాణాలతో శ్మశాన వాటిక ఏర్పాటు, ప్రధాన రహదారుల విస్తరణ వంటి పనులు చేపట్టామన్నారు. తాను చేసిన అభివృద్ధిలో పార్టీ కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధుల సహాయ సహకారాలు మెండుగా ఉన్నాయన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఎల్‌బీగర్‌లో గులాబీ జెండా ఎగురవేయటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే